ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్మార్ట్ ఎడిషన్ Evening 6PM

సంపుటి (Volume): 1 ✦ సంచిక (Issue): 48 ✦ Published From: నంద్యాల (Nandyal) ✦ పేజీలు : 2 ✦ https:www.prajarepublic.com ✦ వెల - 1/- | ఆదివారం 22 సెప్టెంబర్ 2024

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

## ఆర్టికల్ 370ని ఏ శక్తీ తిరిగి తీసుకురాలేదు: ఫరూక్ అబ్దుల్లాపై అమిత్ షా విమర్శలు

**జమ్మూకశ్మీర్ ఆర్టికల్ 370ని ఏ శక్తి తిరిగి తీసుకురాలేదంటూ ప్రతిపక్షాలపై కేంద్రమంత్రి అమిత్ షా విమర్శలు గుప్పించారు.**

శ్రీనగర్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 22: జమ్మూకశ్మీర్లో అసెంబ్లీ ఎన్నికలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే తొలి విడత పోలింగ్ పూర్తయింది. ఈ ఎన్నికల్లో గెలిచేందుకు భాజపా, కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ సహా ఇతర పార్టీలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రాజౌరీ జిల్లా నౌషేరాలో నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో పాల్గొన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. "జమ్మూకశ్మీర్కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన రాజ్యాంగ అధికరణం 370 రద్దు చేస్తూ కేంద్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కానీ, అధికారం వచ్చాక ఆ ఆర్టికల్ను పునరుద్ధరిస్తామని ఫరూక్ అబ్దుల్లా చెబుతున్నారు. ఏ శక్తీ దాన్ని తిరిగి తీసుకురాలేదు. ఇప్పుడు ఈ ప్రాంతంలో బంకర్ల అవసరం లేదు. ఎందుకంటే.. కాల్పులు జరిపే సాహసం ఎవరూ చేయలేరు. జమ్మూకశ్మీర్లో కేవలం మన దేశ త్రివర్ణ పతకం మాత్రమే రెపరెపలాడుతుంది" అని అమిత్ షా పేర్కొన్నారు.

### ఎప్పటికీ అలా జరగదు..



"కొందరు పాకిస్థాన్తో చర్చలు జరపాలని బలంగా కోరుకుంటున్నారు. కానీ, ఉగ్రవాదం అంతమయ్యే వరకు వారితో ఎలాంటి చర్చలు జరిపేది లేదు. దేశంపై దాడికి పాల్పడిన ఉగ్రవాదులను జైలు నుంచి విడుదల చేయాలని వారు (కాంగ్రెస్ను ఉద్దేశిస్తూ) కోరుకుంటున్నారు. కానీ, మోదీ సర్కార్ అలా ఎన్నటికీ చేయదు. భారత ప్రజలపై రాళ్లు రువ్విన వారికి కారాగారం నుంచి విముక్తి కల్పించేది లేదు" అని షా మరోసారి స్పష్టం చేశారు. కాగా.. జమ్మూకశ్మీర్లో ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత మొదటిసారిగా అసెంబ్లీ ఎన్నికలు (సెప్టెంబరు 18న తొలి విడత, సెప్టెంబరు 25న రెండో విడత, అక్టోబరు 1న మూడో విడత) జరుగుతున్నాయి. ఏడు జిల్లాల పరిధిలో తొలిదశ కింద 24 శాసనసభ నియోజకవర్గాలకు ఇటీవల జరిగిన పోలింగు ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 61 శాతం పోలింగు నమోదైంది. దీనిపై అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. తదుపరి విడతల్లో పోలింగ్ జరగాల్సి ఉంది. అక్టోబరు 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

## 8 ఎకరాల భూమి స్వాధీనం.. కూల్చివేతలపై హైడ్రా ప్రకటన

**హెచ్ఎండీఏ పరిధిలోని మూడు ప్రాంతాల్లో ఆదివారం కూల్చివేతలు చేపట్టినట్లు హైడ్రా వెల్లడించింది. సుమారు 8 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది.**



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 22: హెచ్ఎండీఏ పరిధిలోని మూడు ప్రాంతాల్లో ఆదివారం కూల్చివేతలు చేపట్టినట్లు హైడ్రా వెల్లడించింది. సుమారు 8 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. కేవలం వ్యాపారం కోసం నిర్మించిన భవనాలను మాత్రమే కూల్చివేసినట్లు పేర్కొంది. కూకట్పల్లి నల్లచెరువులో అనధికార షెడ్లను కూల్చివేసినట్లు తెలిపింది. నల్లచెరవులోని సర్వే నంబర్ 66, 67, 68, 69లోని మొత్తం 16 వాణిజ్య షెడ్లు, ప్రహరీ గోడలు కూల్చాం. నాలుగు ఎకరాల భూమి స్వాధీనం చేసుకున్నాం" అని హైడ్రా అధికారులు ప్రకటనలో పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ మండలంలోనూ ఆక్రమణలను కూల్చివేసినట్లు హైడ్రా అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలంలో నిర్మించిన భవనాలను కూల్చివేసినట్లు చెప్పారు. 66 కిష్టారెడ్డిపేటలోని సర్వేనంబర్ 164లో 3 భవనాలు కూల్చేశాం. వాణిజ్యపరంగా వినియోగిస్తున్న ఐదంతస్తుల భవనాన్ని కూల్చేశాం. ఒక ఎకరం ప్రభుత్వం స్థలం స్వాధీనం చేసుకున్నాం. పటేల్ గూడలో 25 అక్రమ నిర్మాణాలను కూల్చివేశాం. సర్వేనంబర్ 12/2, 12/3లోని 25 నిర్మాణాలను కూల్చివేశాం. 3 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకున్నాం" అని హైడ్రా అధికారులు వెల్లడించారు.

## ధార్మిక అంశాల్లో రాజీ వద్దు.. వారిపై కఠిన చర్యలు తీసుకోండి: పవన్ కల్యాణ్

**ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్కల్యాణ్ మంగళగిరి క్యాంపు కార్యాలయంలో తితిదే ఈవో శ్యామలరావు భేటీ అయ్యారు.**



మంగళగిరి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 22: ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్కల్యాణ్ మంగళగిరి క్యాంపు కార్యాలయంలో తితిదే ఈవో శ్యామలరావు భేటీ అయ్యారు. లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి అంశంపై పవన్ ఆరా తీశారు. గత పాలకమండలి హయాంలో ప్రసాదంలో కల్తీ జరిగినట్లు ఈవో వివరించారు. తితిదే తరఫున సంప్రోక్షణ చర్యల గురించి చెప్పారు. కల్తీ నెయ్యి అనుమతించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పవన్ ఆదేశించారు. భక్తుల మనోభావాలు, ధార్మిక అంశాల్లో రాజీ వద్దని స్పష్టం చేశారు.

## జగన్ పాలనలో 20 టీఎంసీలు కూడా రాయలసీమకు అందించలేదు: మంత్రి నిమ్మల

**జగన్ పాలనలో హంద్రీనీవా పనులు వెనుకబడిపోయాయని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు.**



నంద్యాల, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 22: జగన్ పాలనలో హంద్రీనీవా పనులు వెనుకబడిపోయాయని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. నంద్యాల జిల్లాలో పర్యటించిన ఆయన.. మల్యాల పంప్ హౌస్ను పరిశీలించారు. 3,850 క్యూసెక్కులు ఎత్తిపోసేలా గతంలో చంద్రబాబు హయాంలో దీన్ని నిర్మించారని చెప్పారు. జగన్ పాలనలో కనీసం 20 టీఎంసీలు కూడా రాయలసీమకు అందించలేదన్నారు. హంద్రీనీవాను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొస్తామని చెప్పారు. గత ఐదేళ్లలో వైకాపా చేసిన పాపాలు, తప్పులు సరి చేస్తున్నామన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోతే బాధితులను జగన్ పరామర్శించలేదని మండిపడ్డారు. కృష్ణా నదికి వరదలొస్తే చంద్రబాబు బస్సులో ఉంటూ పరిస్థితులను చక్కదిద్దారన్నారు. నెలలో రెండు సార్లు పర్యటించి సీమ ప్రాజెక్టులు త్వరగా పూర్తయ్యేలా చేస్తామని నిమ్మల రామానాయుడు హామీ ఇచ్చారు.

## చంద్రబాబు 100 రోజుల పాలన చూసే..

## తెదేపాలో చేరికలు: మంత్రి నారాయణ

**సీఎం చంద్రబాబు 100 రోజుల పాలన చూసి పలువురు తెదేపాలో చేరుతున్నారని పురపాలకశాఖ మంత్రి నారాయణ అన్నారు.**



నెల్లూరు, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 22: సీఎం చంద్రబాబు 100 రోజుల పాలన చూసి పలువురు తెదేపాలో చేరుతున్నారని పురపాలకశాఖ మంత్రి నారాయణ అన్నారు. జిల్లాలోని బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ ఛైర్పర్సన్ మోర్ల సుప్రజ వైకాపాను వీడి తెలుగుదేశంలో చేరారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి.. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఛైర్పర్సన్ తో పాటు మరో ఏడుగురు వైకాపా కౌన్సిలర్లు తెదేపాలో చేరారు. తెలుగుదేశం పార్టీ విధానాలు నచ్చి, బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ అభివృద్ధి కోసం తాము తెదేపాలో చేరామని ఈ సందర్భంగా వారు ప్రకటించారు. అందరికి సహకారంతో బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తెలిపారు. గత వైకాపా ప్రభుత్వం స్థానిక సంస్థల నిధులను దారి మళ్లించడంతో అభివృద్ధి జరగలేదని మంత్రి నారాయణ అన్నారు. నిధుల లేమితో అభివృద్ధికి నోచుకోని నగర పంచాయతీకి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.1.42 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేలా మరిన్ని నిధులు విడుదల చేసేందుకు కృషి చేస్తామని ప్రకటించారు. గెలిపించిన ప్రజలకు మంచి చేయాలనే తెదేపాలో చేరుతున్నారన్నారు. స్థానిక సంస్థలకు కేంద్రం ఇచ్చే నిధులను జగన్ రాబట్టలేకపోయారని నారాయణ విమర్శించారు.

## సింగరేణి కార్మికులకు ఇచ్చింది బోనస్ కాదు.. బోగస్: కేటీఆర్

**సింగరేణి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది దసరా బోనస్ కాదు.. బోగస్ అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు.**



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 22: సింగరేణి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది దసరా బోనస్ కాదు.. బోగస్ అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ హయాంలో సింగరేణి ఎన్నో విజయాలు సాధించిందన్నారు. కాంగ్రెస్ హయాంలో లాభాల్లో వాటా 20 శాతానికి మించలేదని చెప్పారు. హైదరాబాద్లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. సింగరేణి ప్రైవేటీకరణ ప్రక్రియను అడ్డుకునేందుకు అందరూ ముందుకు రావాలని కోరారు. "అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే సింగరేణిలో రూ.1,060 కోట్ల లాభాలు తీసుకొచ్చాం. 2014- 15లో 102 కోట్లకు పైగా కార్మికులకు ఇచ్చాం. 2018-19లో రికార్డు స్థాయిలో లాభాలు వచ్చాయి. ఆ ఏడాది ఒక్కో కార్మికుడికి రూ. లక్ష ఇచ్చాం. 2014లో రూ.17 వేలు ఇస్తే.. పదేళ్లలో లాభాలు పెంచి 2023 నాటికి 1.60 లక్షలు అందజేశాం. ప్రభుత్వం శనివారం ప్రకటించింది దసరా బోనస్ కాదు.. బోగస్. దీంతో ఒక్కో కార్మికుడికి రూ.1.80 లక్షల నష్టం కలిగే పరిస్థితి వచ్చింది. దీనిపై సీఎం నేరుగా సమాధానం చెప్పాలి. డిప్యూటీ సీఎం రూ.4,701కోట్ల లాభాలు వచ్చాయని చెప్పారు. అందులో 33 శాతం వాటా (రూ.1,551కోట్లు) కార్మికులకు ఇచ్చామన్నారు. కార్మికుడికి 33 శాతం వాటా ఇస్తే ఒక్కొక్కరికి రూ.3.70 లక్షల లాభం రావాలి. కానీ ప్రభుత్వం రూ.1.90లక్షలు మాత్రమే బోనస్గా ప్రకటించడాన్ని ఎలా చూడాలి? 16.2శాతం లాభాల్లో వాటాగా ఇస్తూ 33 శాతం అని మభ్యపెడుతున్నారు. సింగరేణి బెల్ట్ మొత్తం కాంగ్రెస్ను గెలిపించింది. వాళ్లకు మీరిచ్చే బహుమతి ఇదా? కేంద్రంలో ఉన్న భాజపా సింగరేణిని ప్రైవేటీకరణ చేయాలని చూస్తోంది.. కాంగ్రెస్ దానికి సహకరిస్తోంది. కార్మికులకు భారాస అండగా ఉంటుంది." అని కేటీఆర్ అన్నారు.

## బాలీవుడ్ నటి జత్వానీకి భద్రత కల్పిస్తున్నాం: విజయవాడ సీపీ

**బాలీవుడ్ నటి కాదంబరీ జత్వానీ కేసులో వైకాపా నేత కుక్కల విద్యాసాగర్ను అరెస్టు చేశామని ఎన్టీఆర్ జిల్లా సీపీ రాజశేఖర్ బాబు తెలిపారు.**




విజయవాడ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 22: బాలీవుడ్ నటి కాదంబరీ జత్వానీ కేసులో వైకాపా నేత కుక్కల విద్యాసాగర్ను అరెస్టు చేశామని ఎన్టీఆర్ జిల్లా సీపీ రాజశేఖర్ బాబు తెలిపారు. ఇవాళ అర్ధరాత్రికి విద్యాసాగర్ను విజయవాడకు తీసుకొస్తామని, సోమవారం కోర్టులో హాజరుపరుస్తాని చెప్పారు. ముంబయి నటి కేసులో పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుగుతోందన్నారు. ఈ వ్యవహారంలో ఇంకా ఎవరెవరు ఉన్నారనేది ఆరా తీసస్తున్నామన్నారు. జత్వానికి భద్రత కల్పిస్తున్నామని తెలిపారు.

## ఐటీ కారిడార్లో భారీ చోరీ.. రూ.2కోట్ల నగదు ఎత్తుకెళ్లిన దొంగలు

**ఐటీ కారిడార్ పీఎస్ పరిధిలో భారీ చోరీ జరిగింది. ఇంటి నుంచి రూ.2 కోట్లకు పైగా నగదు ఎత్తుకెళ్లారు.**

ఘట్కేసర్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 22: హైదరాబాద్ శివారు పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ దొంగతనం జరిగింది. మక్త గ్రామంలోని నాగభూషణం అనే వ్యక్తి ఇంట్లో రూ.2కోట్లకు పైగా నగదును దుండగులు చోరీ చేశారు. ఇంటి తాళాలను పగులగొట్టి బీరువాలో ఉంచిన నోట్ల కట్టలను ఎత్తుకెళ్లారు. బాధితుడు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించి విచారణ చేపట్టారు. పోలీసుల దర్యాప్తులో వెల్లడైన ప్రకారం.. నాగభూషణం ఇటీవల శంకర్పల్లిలో 10 ఎకరాల భూమి విక్రయానికి ఒప్పందం చేసుకున్నారు.కొనుగోలుదారులు అడ్వాన్గా రూ.2కోట్ల 2లక్షల నగదు ఇవ్వడంతో ఇంట్లో ఉంచారు. ఆ నగదుతో పాటు 28 తులాల బంగారు నగలను దొంగలు ఎత్తుకెళ్లారు. నాగభూషణం వద్ద డ్రైవర్గా పనిచేస్తున్న వ్యక్తిపై అనుమానంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.




## చోరీకి గురైన రూ.50 లక్షల విలువ చేసే 400 సెల్ఫోన్లు స్వాధీనం

విజయవాడ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 22: మీ సెల్ఫోన్ పోయిందా.. మాకు ఫిర్యాదు చేయండి.. మేం వెతికి ఇస్తామంటున్నారు ఎన్టీఆర్ జిల్లా పోలీసులు. రూ.50లక్షలు విలువ చేసే 400 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేశారు. ఆధునిక సాంకేతికతను వినియోగించి సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా ఫోన్లను కనిపెట్టారు. కొందరు కిలాడీలు సెల్ఫోన్లను అపహరించి ఇతర రాష్ట్రాల్లో విక్రయిస్తున్నారు. చెన్నై, హైదరాబాద్తోటు పలు రాష్ట్రాల్లో విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. ఐఎంఈఐ నంబర్ ద్వారా వాటిని ట్రాక్ చేసి ఫోన్లు ఉన్న ప్రాంతాలను గుర్తించారు. ఆ ఫోన్లను వినియోగిస్తున్న వారి నుంచి స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించారు. చరవాణి మాయమైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎన్టీఆర్ జిల్లా సీపీ రాజశేఖరబాబు సూచిస్తున్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు వాటిపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు సైబర్ కమాండోలను తయారు చేస్తున్నామని సీపీ తెలిపారు. సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930కి ఫోన్ చేయాలన్నారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# ఎన్టీఆర్ స్పీచ్ కోసం ఫ్యాన్స్ స్పెషల్ ఇంట్రెస్ట్



జూనియర్ ఎన్టీఆర్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం దేవర: పార్ట్ 1. ఈ సినిమా సెప్టెంబర్ 27, 2024న గ్రాండ్ రిలీజ్‌కి సిద్ధమవుతోంది. కొరటాల శివ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటించింది. ఐతే, ఈ సాయంత్రం, హైదరాబాద్ లోని నోవాటెల్ లో దేవర ప్రీ-రిలీజ్ ఈవెంట్ జరగబోతుంది. బ్లాక్ బస్టర్ ఆర్ఆర్ఆర్ వచ్చిన రెండేళ్ల తర్వాత మళ్లీ ఎన్టీఆర్ సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్ జరుగుతుంది. మరి ఈ వేదికపై జూనియర్ ఎన్టీఆర్ ఏం మాట్లాడబోతున్నారు ?, చాలా కాలం తర్వాత తారక్ ప్రసంగాన్ని అభిమానులు వినబోతున్నారు. అందుకే, ఎన్టీఆర్ స్పీచ్ కోసం ఫ్యాన్స్ ప్రత్యేకించి ఆసక్తిగా చూపిస్తున్నారు. ఇక ఈ వేడుకలో అనిరుధ్ రవిచందర్ ప్రత్యక్ష ప్రదర్శన ఉండబోతుంది. కాగా ఈ సినిమాలో సైఫ్ అలీ ఖాన్, ప్రకాష్ రాజ్, శ్రీకాంత్ మరియు షైన్ టామ్ చాకో కీలక పాత్రల్లో నటించారు. మరి పాన్ ఇండియా రేంజ్ లో ఈ సినిమా ఏ రేంజ్ వసూళ్లు సాధిస్తోందో చూడాలి.

## 'సలార్ 2' స్పెషల్ సీక్వెన్స్ కోసం భారీ సెట్ ?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కిన 'సలార్' బ్లాక్ బస్టర్ హిట్ అవ్వడంతో సలార్-2 పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఐతే, తాజాగా ఈ సినిమాకి సంబంధించి మరో క్రేజీ న్యూస్ వినిపిస్తోంది. ఈ సినిమాలోని ఓ స్పెషల్ యాక్షన్ సీక్వెన్స్ కోసం రామోజీ ఫిల్మ్ సిటీలో ఓ భారీ సెట్ ను వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సీక్వెన్స్ లో ప్రభాస్- మిగిలిన ప్రధాన పాత్రల పై భారీ యాక్షన్ సీన్స్ ను షూట్ చేస్తారట. ఈ సీన్స్ లోని యాక్షన్ విజువల్స్ చాలా వైల్డ్ గా ఉంటాయట. ఈ యాక్షన్ సీక్వెన్స్ లో ప్రభాస్ గెటప్ అండ్ సెటప్ చాలా థ్రిల్లింగ్ గా ఉంటుందని తెలుస్తోంది. అన్నట్టు ఈ సీక్వెల్‌లో నటిస్తున్న శృతి హాసన్, జగపతి బాబు, బాబీ సింహా, పృథ్వీరాజ్ సుకుమారన్ మరియు శ్రియా రెడ్డి కూడా ఈ యాక్షన్ ఎపిసోడ్స్ తో తిరిగి సెట్స్ పైకి రానున్నారు. కాగా, ఈ పార్ట్ 2 సినిమాకు 'శౌర్యాంగ పర్వం' అనే టైటిల్ ను ఖరారు చేశారు. కాగా ఆ మధ్య 'సలార్ 2' సినిమా నిర్మాత విజయ్ కిరగందూర్ కూడా మాట్లాడుతూ.. 'ఈ సినిమా పార్ట్-2ని త్వరగా పూర్తి చేసి.. 2025లో రిలీజ్ చేస్తామన్నారు. కాగా, పార్ట్-2 సినిమా 'గేమ్ ఆఫ్ థ్రోన్స్'లా ఉండనుందని ఆయన తెలిపారు. మొత్తానికి సలార్ 2తో ప్రభాస్ ఇంకెన్ని రికార్డ్స్ క్రియేట్ చేస్తాడో చూడాలి.



రిపబ్లిక్ సినిమా CINEMA

## బిగ్ అప్ డేట్ కి రెడీ అయిన 'గేమ్ ఛేంజర్' !



స్టార్ డైరెక్టర్ శంకర్ - మెగాపవర్ స్టార్ 'రామ్ చరణ్ తేజ్' కాంబినేషన్‌లో రాబోతున్న పాన్ ఇండియా సినిమా 'గేమ్ ఛేంజర్'. ఈ పొలిటికల్ డ్రామా, ప్రస్తుతం ఓ ప్రధాన ప్రకటన కోసం సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించి మేకర్స్ క్లారిటీ ఇస్తూ ఎక్స్ లో ఓ పోస్ట్ పెట్టారు. ఉత్తేజకరమైన అప్‌డేట్ తో త్వరలో రాబోతున్నామని స్పష్టం చేశారు. ఈ సినిమా విడుదల తేదీకి (డిసెంబర్ 20, 2024న) సంబంధించిన అధికారిక అప్ డేట్ తో పాటు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సెకండ్ సింగిల్ విడుదల తేదీని కూడా ఈ అప్ డేట్ లో చేర్చవచ్చని తెలుస్తోంది. కాగా ఈ మూవీలో చరణ్ సరసన కియారా అద్వానీ హీరోయిన్ గా నటిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు. అలాగే, ఈ చిత్రంలో అంజలి, శ్రీకాంత్, ఎస్‌జె సూర్య, నవీన్ చంద్ర వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా పై భారీ అంచనాలు ఉన్నాయి. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమా కోసం చరణ్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1791: ఆంగ్ల రసాయన, భౌతిక శాస్త్రవేత్త మైకేల్ ఫారడే జననం (మ. 1867).
- 1930: భారతీయ చలనచిత్ర నేపథ్యగాయకుడు ప్రతివాది భయంకర శ్రీనివాస్ జననం (మ. 2013).
- 1952: భారత స్వాంతంత్ర్య సమరయోధుడు, రచయిత, కళాకారుడు, నాటక కర్త అడివి బాపిరాజు మరణం (జ. 1895).
- 1977: అనువాదకురాలు, ప్రజాసేవకురాలు రామినేని రామానుజమ్మ మరణం (జ. 1880).
- 2011: భారత మాజీ టెస్ట్ క్రికెట్ క్రీడాకారుడు మన్సూర్ అలీ ఖాన్ పటౌడి మరణం (జ. 1941).
- 1988: భారతీయ నటి, మోడల్ సనా సయీద్ జననం.
- 1965: ఐక్యరాజ్యసమితి కాల్పుల విరమణ పిలుపునిచ్చిన తర్వాత కాశ్మీర్‌పై భారతదేశం, పాకిస్తాన్ మధ్య 1965 నాటి ఇండో-పాకిస్తాన్ యుద్ధం ముగిసింది.



మైకేల్ ఫారడే



భయంకర శ్రీనివాస్



అడివి బాపిరాజు



మన్సూర్ అలీ ఖాన్ పటౌడి



నటి, మోడల్ సనా సయీద్



ఇండో-పాకిస్తాన్ యుద్ధం

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

## ఏ స్థానంలో వచ్చినా.. ప్రదర్శన బాగుంటే చాలు: గిల్

సుదీర్ఘ ఫార్మాట్ క్రికెట్ జట్టులో మూడో స్థానంలో ఎవరిని ఆడించాలనే దానిపై చాలా కాలంగా చర్చలు జరుగుతున్నాయి.




చెన్నై వేదికగా బంగ్లాదేశ్తో జరిగిన తొలి టెస్టులో భారత్ ఘన విజయం సాధించింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లా 234 పరుగులకు ఆలౌటైంది. అయితే, రెండో ఇన్నింగ్స్లో మ్యాచ్ ప్రారంభంలోనే ఓపెనర్లు ఇద్దరూ పెవిలియన్ చేరడంతో మూడో స్థానంలో వచ్చిన శుభ్మన్ గిల్.. రిషభ్ పంత్తో కలిసి దూకుడుగా ఆడాడు. వీరిద్దరూ చేసిన అజేయ శతకాలతో టీన్‌ఇండియాకు భారీ ఆధిక్యం లభించింది. ఇక సుదీర్ఘ ఫార్మాట్ క్రికెట్ జట్టులో మూడో స్థానంలో ఎవరిని ఆడించాలనే దానిపై చాలా కాలంగా చర్చలు జరుగుతున్నాయి. 2023లో పుజారా స్థానాన్ని అందిపుచ్చుకున్న శుభ్మన్ గిల్ వెస్టిండీస్ పర్యటనలో భాగంగా మూడు ఇన్నింగ్స్ లు ఆడి 45 పరుగులు మాత్రమే చేశాడు. ఆ తర్వాత దక్షిణాఫ్రికా పర్యటన నుంచి స్వదేశంలో జరిగిన ఇంగ్లండ్ సిరీస్ వరకు పేలవ ప్రదర్శనలు ఇస్తూ వచ్చాడు. ఆ తర్వాత పుంజుకుని వైజాగ్ లో జరిగిన రెండో టెస్టులో కీలక సెంచరీ చేశాడు. ఆ తర్వాత వరుస ఫిఫ్టీలు, సెంచరీలతో అద్భుత ప్రదర్శన కనబరుస్తూ అతడి స్థానంపై వస్తోన్న విమర్శకులకు చెక్ పెట్టాడు. అయితే మూడో స్థానంపై వస్తోన్న చర్చల గురించి గిల్ స్పందించాడు. 'నేను పరుగులు చేయనప్పటికీ ఈ స్థానంలో ఆడగలననే ఎప్పుడూ భావించాను. ఏ స్థానంలో ఆడామన్నది విషయం కాదు. నా ప్రదర్శన ఎలా ఉంది అనేది ముఖ్యం. నాకు పిచ్ ఎలా ఉన్నా ఎదుర్కోగలననే నమ్మకం ఉంది. ఇండియా ఏ, రంజీ ట్రోఫీల్లో ఆడినప్పుడు 5,4,3వ స్థానాల్లో కూడా బ్యాటింగ్కు వచ్చి పరుగులు చేశాను. ఓపెనింగ్ కూడా పరుగులు సాధిస్తాననే నమ్మకం. నాకుంది' అని గిల్ వెల్లడించాడు. ఇక బంగ్లాదేశ్తో జరిగిన తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్లో డకౌట్గా వెనుదిరిగిన గిల్.. రెండో ఇన్నింగ్స్లో శతకం(119)తో చెలరేగిపోయాడు. పంత్తో కలిసి జట్టుకు భారీ స్కోర్ అందించాడు.


## ఇంటి చిట్కాలు

# సీతాఫలాలు తింటే ఈ సమస్యలన్నీ దూరం

చాలా మంది ఇష్టపడే పండ్లలో మామిడి పండ్ల తర్వాత, సీతాఫలాలు ఉంటాయి. ఇప్పుడు ఈ సీజన్ స్టార్ట్ అవుతుంది. ఈ పండ్లని తీసుకోవడం వల్ల కలిగే లాభాలేంటో తెలుసుకోండి. ఫైబర్, విటమిన్స్, ఖనిజాలు ఎక్కువగా పండ్లలో సీతాఫలాలు కూడా ఒకటి. వీటిని తినడం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుంది. మంట తగ్గుతుంది. కంటి, గుండె ఆరోగ్యం పెరుగుతుంది. వీటిని తినడం వల్ల చాలా లాభాలు కూడా ఉన్నాయి. అవేంటో తెలుసుకోండి.



### డిప్రెషన్ తగ్గడం..



సీతాఫలాల్లో విటమిన్ బి6 ఉంటుంది. ఇది మానసిక స్థితిని కంట్రోల్ చేసే సెరోటోనిన్, డోపమైన్, న్యూరో ట్రాన్స్‌మీటర్‌ని రిలీజ్ చేస్తుంది. ఈ విటమిన్ కారణంగా మూడ్ డిసార్డర్ సమస్య తగ్గుతుంది. దీని వల్ల డిప్రెషన్ దూరమవుతుంది.

### బీపీ కంట్రోల్..



సీతాఫలాల్లో పొటాషియం, మెగ్నీషియంలు ఉంటాయి. ఇవి బీపిని కంట్రోల్ చేస్తాయి. దీని వల్ల గుండె సమస్యలు, స్ట్రోక్ ప్రమాదం తగ్గుతుంది. ఇందులోని పొటాషియం సిస్టోలిక్, డయాస్టోలిక్ బీపిని కంట్రోల్ చేస్తుంది. మెగ్నీషియం హైబీపి సమస్యని తగ్గిస్తుంది.

### ఇమ్యూనిటీ..

మనం ఎలాంటి జబ్బులకి గురికాకుండా ఉండాలంటే మనలో ఇమ్యూనిటీ బలంగా ఉండాలి. ఇమ్యూనిటీని బలంగా చేసేది విటమిన్.. విటమిన్ సీ ఈ పండ్లలో ఎక్కువగా ఉంటుంది. దీంతో చాలా వరకూ ఆరోగ్య సమస్యల, సీజనల్ వ్యాధులు దూరమవుతాయి.




### క్యాన్సర్స్ దూరం..

సీతాఫలాల్లో కొన్ని సమ్మేళనాలు ఉంటాయి. ఇవి క్యాన్సర్స్‌కి వ్యతిరేకంగా పోరాడతాయి. క్యాన్సర్ కణాల పెరుగుదలని తగ్గిస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల కొలన్, స్టమక్, బ్రెస్ట్ క్యాన్సర్స్ తగ్గుతాయి. ఈ పండ్లలోని ఫ్లేవనాయిడ్స్ కొన్ని రకాల క్యాన్సర్స్‌ని దూరం చేస్తాయి.



### కంటి ఆరోగ్యం..



సీతాఫలాల్లో యాంటీ ఆక్సిడెంట్ లుటీన్ పుష్కలంగా ఉంటుంది. ఇది కళ్ళలోని ముఖ్యమైన యాంటీ ఆక్సిడెంట్స్‌లో ఒకటైన ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతుంది. దీంతో కంటి ఆరోగ్యం మెరుగవుతుంది. కొన్ని అధ్యయనాల ప్రకారం కంటి ఆరోగ్యం లుటీన్ తీసుకోవడంతో ముడిపడి ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల కంటి సమస్యలు తగ్గుతాయి. కంటి శుక్లాలు, దృష్టి సమస్యలు తగ్గుతాయి. కాబట్టి, వీటిని తీసుకుంటే కంటి ఆరోగ్యం బాగుంటుంది.

### సైడ్ ఎఫెక్ట్స్..

సీతాఫలాలు ఆరోగ్యానికి మంచివే అయినప్పటికీ వీటిని తినడం వల్ల కూడా కొన్ని సమస్యలు ఉన్నాయి. ఇందులో అనోనాసిన్ అనే టాక్సిన్ ఉంటుంది. ఇది మెదడు, నాడీ వ్యవస్థను ఎఫెక్ట్ చేస్తుంది. దీని వల్ల పార్కిన్సన్స్ సమస్య వచ్చే అవకాశం ఉంది. అనోనాసిన్ సీతాఫలాల్లోని గింజలు, చర్మంలో ఎక్కువగా ఉంటుంది. కాబట్టి,, తినడానికి ముందు గింజలు, పై చర్మాన్ని తీసేసి తినండి. ఆల్రెడీ నాడీ సమస్యలు, పార్కిన్సన్స్ సమస్యలు ఉంటే ఈ పండ్లు తినకపోవడమే మంచిది. అదే ఎక్కువగా తిన్న ఈ పండ్లు తినడం వల్ల డయాబెటిస్ పేషెంట్స్‌కి అంత మంచిది కాదు. పండ్లు ఆరోగ్యకరమైనప్పటికీ ఎక్కువగా తినకపోవడమే మంచిదని గుర్తుపెట్టుకోండి.



గమనిక: ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఇవి పాటించడం వల్ల ఫలితాలు అనేవి వ్యక్తిగతం మాత్రమే. వీటిని పాటించే ముందు డైటీషియన్‌ని సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.